## గాయత్రిని అభినందించిన కలెక్టర్



గాయత్రిని సన్మానిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, ఏప్రిల్ 2 : టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 తుది ఫలితాల్లో జిల్లాస్థాయి అధికారి ఉద్యోగానికి జిల్లా బీసీ సంక్షేమ శాఖ జూనియర్ అసిస్టెంట్ కొండపల్లి గాయత్రి ఎంపికైంది. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్ నాయక్, ఎస్సీ కార్పొరేషన్ దయానంద్ బుధవారం శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఉద్యోగి రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌సీయూ భూములను కాపాడాలి




బాన్సువాడలో డీవోకు వినతి పత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కామారెడ్డి, ఏప్రిల్ 2 : హెచ్‌సీయూ భూములను కాపాడాలని బీవీఎం రాష్ట్ర కార్యదర్శి విఠల్ అన్నారు. జిల్లా కేంద్రంలో భారతీయ విద్యార్థి మోర్చా ఆధ్వర్యంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెచ్‌సీయూ భూములను పెట్టుబడిదారులకు అప్పగించే ఆలోచనలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విరమించుకోవాలని అన్నారు. హెచ్‌సీయూ విద్యార్థులపై అమానుషంగా వ్యవహరించి, అక్రమంగా లాఠీచార్జి, అరెస్టులకు పాల్పడడం సరికాదన్నారు. తొలి తెలంగాణ ఉద్యమానికి ప్రతీక అయిన హెచ్‌సీయూ భూమిని యథాతథంగా ఉంచి పర్యావరణ పరిరక్షణ, మూగజీవాల ప్రాణాలు కాపాడాలని కోరారు. సమావేశంలో బీవీఎం జిల్లా అధ్యక్షుడు ఖాన్, నాయకులు పెరుమాండ్ల బుల్లెట్, కృష్ణ, అశోక్ పాల్గొన్నారు.

**భూముల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి**

బాన్సువాడ, ఏప్రిల్ 2 : హైదరాబాద్‌లోని హెచ్‌సీయూ భూముల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు సబ్ కలెక్టర్ కార్యాలయంలో డీవో సువర్ణకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 400 ఎకరాల భూమి ఆక్రమణతో యూనివర్సిటీ అభివృద్ధికి ఆటంకం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో మోచి గణేశ్, శివసూరి, గాండ్ల కృష్ణ, అనిల్, జీవన్, సంజీవ్, యాదవ్, శంకర్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలు కల్పించాలి

కామారెడ్డి, ఏప్రిల్ 2 : సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలు కల్పించాలని ఉద్యమ నిరుద్యోగుల కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సొంటెం సాయిలు యాదవ్ అన్నారు. ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ వచ్చాక గత ప్రభుత్వ హయాంలో 550 మందికి ఉద్యోగాలు ఇచ్చారని తెలిపారు. రేవంత్ రెడ్డి వచ్చాక ఇప్పటి వరకు ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో కళాకారులు శ్రీనివాస్ యాదవ్, రాజలింగం, ఎల్లయ్య యాదవ్, దేవరాజ్ రెడ్డి, రాజయ్య, శంకర్ గౌడ్, వడ్ల వెంకన్న, కిషన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ వసూళ్లలో కామారెడ్డి టాప్

కామారెడ్డి, ఏప్రిల్ 2 : రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన రెవెన్యూ వసూళ్లలో కామారెడ్డి రాష్ట్రంలోనే టాప్‌లో నిలవడంతో బుధవారం ఆర్టీఏ కార్యాలయంలో డీటీవో శ్రీనివాస్‌రెడ్డి కేక్ కట్ చేసి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతేడాది లక్ష్యం రూ.63 కోట్లు ఉండగా ఈ సారి రూ.73 కోట్ల లక్ష్యానికిగాను రూ.68.19 కోట్లు వసూలు చేసిందని తెలిపారు. హెల్మెట్ ధరించక ఏటా సుమారు 240 మంది చనిపోతున్నారని అన్నారు. మరణాల సంఖ్యను తగ్గించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఎంవై శ్రీనివాస్, ఆర్టీ మెంబర్ ఎజాజ్ అహ్మద్, ఏఎంవీఐలు భిక్షపతి, అఫ్రోజ్, సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం

కామారెడ్డి, ఏప్రిల్ 2 : జిల్లా కేంద్రంలో ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జన్యుపరమైన కారణాలతో ఆటిజం వ్యాధి వస్తుందని, పిల్లల మానసిక ఎదుగుదల సరిగ్గా జరగక సాధారణ జీవితం గడపడం కష్టం అవుతుందని అన్నారు. ఆరోగ్యంపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రముఖ పిల్లల వైద్యులు అరవింద్ గౌడ్, ఫిజీషియన్ డాక్టర్ వెంకట్, వెంకటేశ్వర్ గౌడ్, వైద్యులు పుట్ట మల్లికార్జున్‌గౌడ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఈఎంటీ దినోత్సవం

కామారెడ్డి, ఏప్రిల్ 2 : జిల్లా కేంద్రంలో 108 అంబులెన్స్, ఈఎంటీ (ఎమెర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్) దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. 108 ఉద్యోగులు రాత్రనక, పగలనక ఎటువంటి అత్యవసర పరిస్థితిలోనైనా ప్రజలను కాపాడడంలో ముందుంటారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా మేనేజర్ తిరుపతి, ఉద్యోగులు కృష్ణస్వామి, శంకర్, రాజేందర్, సురేశ్, పైలట్లు విజయ్ కుమార్, బాలనర్సింహులు, కార్తీక్, రాజయ్య, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## నిందితుడి అరెస్టు

కామారెడ్డి, ఏప్రిల్ 2 : నిషేధిత అల్ప్రాజోలం కేసులో పరారీలో ఉన్న మరో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్పీ రాజేశ్‌చంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మద్నూర్ పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసులో నిషేధిత అల్ప్రాజోలం కలిగి ఉన్న, తయారీ చేసి వ్యాపారం చేస్తున్న కేసుల్లో ముగ్గురిని ఇది వరకే అరెస్టు చేయగా పరారీలో ఉన్న శ్రీనివాస్ గౌడ్‌ను (ప్రధాన పత్రిక విలేకరి) బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. నిందితుడి నుంచి మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. జిల్లాలో నిషేధిత మత్తు పదార్థాలు కలిగి ఉన్న, సరఫరా చేసిన, విక్రయించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# సర్దార్ పాపన్న గౌడ్‌కు ఘన నివాళి



కామారెడ్డిలో సర్దార్ పాపన్న గౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్



చిన్నమల్లారెడ్డిలో సర్దార్ పాపన్నకు నివాళులర్పిస్తున్న గౌడ కులస్తులు

కామారెడ్డి/బీబీపేట్/కామారెడ్డి రూరల్/నాగిరెడ్డిపేట, ఏప్రిల్ 2 : జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సర్దార్ పాపన్న గౌడ్ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సర్వాయి పాపన్న ఎన్నో పోరాటాలు చేసి సమ సమాజ స్థాపన కోసం, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, చందర్ నాయక్, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ చక్రధర్, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ నరేశ్, పవన్, స్వప్న, సునీత, రాజేశ్వర్, గౌడ సంఘ నాయకులు రాజాగౌడ్, తిరుమల గౌడ్, కల్లు గీత కార్మికులు, సంఘ నాయకులు మహేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. దోమకొండ, బీబీపేట మండల కేంద్రాలతోపాటు మాందాపూర్, ఉప్పర్‌పల్లి, ఇస్సానగర్, తుజాల్‌పూర్ తదితర గ్రామాల్లో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల గౌడ సంఘం ప్రతినిధులు, సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామంలో గీత పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కామారెడ్డి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గోపీ గౌడ్, అధ్యక్షుడు ధర్మగోని కిషన్‌గౌడ్, శంకర్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మీరాజాగౌడ్, రామాగౌడ్, టీ.నర్సాగౌడ్, సంఘ సభ్యులు పాల్గొన్నారు. నాగిరెడ్డిపేటలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతిని గౌడ కులస్తులు నిర్వహించారు. పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు యాదగిరిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, వంశీకృష్ణాగౌడ్, మశ్చేందర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

బాన్సువాడ రూరల్, ఏప్రిల్ 2 : ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో బషీరుద్దీన్ లబ్ధిదారులకు బుధవారం సూచించారు. మండలంలోని నాగారంలో చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఆయన వెంట గ్రామ పంచాయతీ కార్యదర్శి నవీన్ గౌడ్ ఉన్నారు.

## పెద్దమ్మ ఆలయంలో చోరీ

భిక్కనూరు, ఏప్రిల్ 2 : పెద్దమ్మ ఆలయంలో చోరీ జరిగిందని ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బస్వాపూర్‌లో ఉన్న పెద్దమ్మ ఆలయంలో గత నెల 29వ తేదీ రాత్రి ఇత్తడి గంటను దుండగులు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన ఆలయంలో ఉన్న సీసీ టీవీలో రికార్డు అయ్యిందని, దాని ఆధారంగా బుధవారం అందిన ఫిర్యాదు మేరకు కేసు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



బోర్లం క్యాంపులో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న బోర్లం సొసైటీ అధ్యక్షుడు సంగ్రాం నాయక్

బాన్సువాడ రూరల్/నస్రుల్లాబాద్, ఏప్రిల్ 2 : రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని బోర్లం సహకారం సంఘం అధ్యక్షుడు సంగ్రాం నాయక్ రైతులకు సూచించారు. బాన్సువాడ మండలంలోని బోర్లం సొసైటీ పరిధిలో ఉన్న బోర్లం క్యాంపు, జక్కల్‌దాని తండా గ్రామాల్లో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సొసైటీ డైరెక్టర్లు, రైతులతో కలిసి బుధవారం ప్రారంభించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు లక్ష్మి, ఏఎంసీ మాజీ చైర్మన్ నర్సింహులు, బాపురెడ్డి, రాజేశ్వర్‌గౌడ్, జలీల్, గోపన్‌పల్లి సాయిలు, మన్నెచిన్న సాయిలు, జనార్దన్‌రెడ్డి, అమీన్, ఆనంద్, వెంకాగౌడ్, సులేమాన్, రైతులు తదితరులు పాల్గొన్నారు. నస్రుల్లాబాద్ మండలంలోని మైలారం గ్రామంలో ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ శ్యామల, నస్రుల్లాబాద్, హాజీపూర్ గ్రామాల్లో విండో చైర్మన్ గంగారాం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. బీర్కూర్ మండలం రైతునగర్, అన్నారం, మిర్జాపూర్ గ్రామాల్లో విండో చైర్మన్లు చైతన్య, కృష్ణ, రాంబాబు ప్రారంభించారు.

## ఇంకుడు గుంతల పరిశీలన



ఇంకుడు గుంత పనులను పరిశీలిస్తున్న కమిషనర్

బాన్సువాడ టౌన్, ఏప్రిల్ 2 : బాన్సువాడ పట్టణ పరిధిలోని ప్రభుత్వ బోరు బావి చుట్టూ నిర్మిస్తున్న ఇంకుడు గుంతల పనులను కమిషనర్ శ్రీహరి రాజు మున్సిపల్ మేనేజర్ మల్లికార్జున్‌తో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భూగర్భ జలాలు పెంచడానికి ఇంకుడు గుంతలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. బాన్సువాడ మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ స్థలాల్లో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది శ్రీనివాస్ రెడ్డి, తులా శ్రీనివాస్, విఠల్, మోహన్ పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న కుస్తీ పోటీలు

బాన్సువాడ రూరల్, ఏప్రిల్ 2 : ఉగాది పండుగను పురస్కరించుకొని బాన్సువాడ మండలంలోని కోనాపూర్ గ్రామంలో బుధవారం నిర్వహించిన కుస్తీ పోటీలు ఆకట్టుకున్నాయి. కుస్తీ పోటీల్లో తలపడేందుకు మహారాష్ట్ర, కర్ణాటక నుంచి మల్లయోధులు తరలివచ్చారు. ఈ పోటీలను తిలకించేందుకు కోనాపూర్ చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు భారీగా తరలి వచ్చారు. మొదటి బహుమతిగా మూడు తులాల వెండి కడియం, రెండో బహుమతిగా రెండు తులాల వెండి కడియాలను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు శంకర్, వెంకటరమణ, దిల్‌రాజు, హన్మాండ్లు, గంగాధర్, లక్ష్మణ్, సాయిలు, రమేశ్ పాల్గొన్నారు.

## రేషన్ షాపుల తనిఖీ

రాజంపేట్/మాచారెడ్డి, ఏప్రిల్ 2 : రాజంపేటలోని రేషన్ షాపులను జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సన్న బియ్యం పంపిణీ వివరాలను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. సన్న బియ్యం నాణ్యతను పరిశీలించారు. బియ్యం నిల్వలపై ఆరా తీశారు. స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ ఉన్నారు. మాచారెడ్డి మండలంలోని ఘన్‌పూర్‌లో రేషన్ షాపును తహసీల్దార్ శ్వేత తనిఖీ చేశారు. అక్కాపూర్, బంజపల్లి గ్రామాల్లో ఆర్ఐ రమేశ్ రేషన్ షాపులను తనిఖీ చేశారు. అనంతరం స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు.



రేషన్ షాపును తనిఖీ చేస్తున్న జిల్లా పౌర సరఫరాల అధికారి

## నిజాంసాగర్ నీటి విడుదల



నిజాంసాగర్ ప్రధాన కాలువలో ప్రవహిస్తున్న నీరు

నిజాంసాగర్, ఏప్రిల్ 2 : నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి యాసంగి పంటలకు ఆరో విడుత (చివరి విడుత) నీటిని బుధవారం విడుదల చేశామని ప్రాజెక్టు ఏఈఈ సాకేత్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం 1600 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నామన్నారు. యాసంగి పంటలకు ఈ నీరు చివరి విడుత అని, రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని, వృథా చేయవద్దని రైతులకు సూచించారు.

## ట్యాంకులను క్లోరినేషన్ చేయాలి

నిజాంసాగర్, ఏప్రిల్ : మండల పరిషత్ కార్యాలయంలో డీపీవో మురళి ఆధ్వర్యంలో గ్రామ కార్యదర్శులకు బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఉపాధి పనుల తీరు, డంపింగ్ యార్డ్స్ నిర్వహణ, తాగునీటి ట్యాంకుల శుభ్రత మొదలైన అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతి నెలా 1వ, 11వ, 21వ తేదీల్లో తాగునీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయాలని కార్యదర్శులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏంపీడీవో గంగాధర్, ఏంపీవో అనిత, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

## రేషన్‌దుకాణాల తనిఖీ



స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేస్తున్న గిర్దావర్ శ్రీనివాస్

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 2: ఎల్లారెడ్డి పట్టణంతో పాటు వివిధ గ్రామాల్లోని రేషన్ దుకాణాలను గిర్దావర్ శ్రీనివాస్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ఎనిమిది రేషన్ దుకాణాలతో పాటు మున్సిపల్ పరిధిలోని లింగారెడ్డిపేట్, మండలంలోని కళ్యాణి, తిమ్మారెడ్డి, అన్నాసాగర్, వెల్లుట్ల, వెల్లుట్లపేట గ్రామాలకు చెందిన రేషన్‌షాపులను పరిశీలించామన్నారు. రేషన్‌షాపుల్లో కార్డులు ఎన్ని, తగినన్ని సన్న బియ్యం వచ్చాయా, లేదా సన్న బియ్యం పంపిణీ అవుతున్నాయా, వచ్చిన వాటిని లబ్ధిదారులు తీసుకుంటున్నారా, లేదా అనే విషయాలను పరిశీలిస్తున్నట్లు ఆయన తెలిపారు.

## శాశ్వత న్యాయమూర్తిని నియమించాలి



జడ్జి పుల్లా కార్తీక్‌ను కలిసిన బిచ్కుంద న్యాయవాదులు

బిచ్కుంద, ఏప్రిల్ 2 : తెలంగాణ హైకోర్టు కామారెడ్డి పోర్ట్‌పోలియో జడ్జి పుల్లా కార్తీక్‌ను బిచ్కుంద జూనియర్ సివిల్ కోర్టు న్యాయవాదులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జడ్జికి వినతిపత్రం అందజేశారు. బిచ్కుంద కోర్టులో మూడున్నరేండ్లుగా న్యాయమూర్తి లేకపోవడంతో న్యాయవాదులు, కక్షిదారులు చాలా ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. బిచ్కుంద కోర్టుకు శాశ్వత న్యాయమూర్తిని నియమించాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రకాశ్ పటేల్, ఉపాధ్యక్షుడు రాజేశ్వర్ దేశ్‌ముఖ్, జనరల్ సెక్రెటరీ శివాజి, ట్రెజరీ టి.విఠల్, బార్ సభ్యులు మల్లేశ్వర్, లక్ష్మణ్‌రావు, ఎ.విఠల్‌రావు, అనంత్‌రావు, శంకర్‌రావు, శ్రీనివాస్, రవి, పురుషోత్తం, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# పొరపాట్లు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి



నాగిరెడ్డిపేటలో తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందిస్తున్న గోపాల్‌పేట గ్రామ రైతులు

నాగిరెడ్డిపేట, ఏప్రిల్ 2: ఎలాంటి పొరపాట్లు లేకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహించాలని మహిళా సమాఖ్య సభ్యులకు తహసీల్దార్ శ్రీనివాస్ సూచించారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మహిళా సమాఖ్యలకు కేటాయించారన్నారు. మండలంలో 11 ధాన్యం కొనుగోలు కేంద్రాలను సమాఖ్యలకు కేటాయించారని పేర్కొన్నారు. అధికారుల ఆదేశాల మేరకు నాణ్యత, నిబంధనలతో ధాన్యం సేకరణ చేపట్టాలని, రైస్ మిల్లర్ల నుంచి ఎలాంటి ఇబ్బందులు వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోళ్ల నిర్వాహణపై కొనుగోలు కేంద్రాల కమిటీ సభ్యులు, వీవోఏలు, ఐకేపీ సిబ్బందికి ఐకేపీ ఏపీఎం జగదీశ్, వ్యవసాయ శాఖ అధికారి సాయికిరణ్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు శాంత, సిబ్బంది పాల్గొన్నారు.

**కొనుగోలు కేంద్రం సొసైటీకే ఉండాలని వినతి..**

నాగిరెడ్డిపేట, ఏప్రిల్ 2: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మాల్తుమ్మెద సొసైటీకి ఉంచాలని కోరుతూ బుధవారం గోపాల్‌పేట గ్రామ రైతులు తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. ఇప్పటి వరకూ గోపాల్‌పేట ధాన్యం కొనుగోలు కేంద్రం సొసైటీ పరిధిలో ఉన్నదన్నారు. తమ రైతులకు సంబంధించిన సొసైటీకి తమ ధాన్యం తరలించడం ద్వారా అన్ని రకాలుగా ఉపయోగాలు ఉన్నాయన్నారు. అన్ని రకాల సౌకర్యాలు ఉన్న సొసైటీకే కొనుగోలు కేంద్రం కేటాయించాలని కోరారు. విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తహసీల్దార్ రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ రైతులు ఫరీద్, మశ్చేందర్, ఏస్‌రెడ్డి, కిష్టఫర్, వంశీగౌడ్, సాయిలు, సిద్ధిరాములు, రాజయ్య, యాదగిరి తదితరులు ఉన్నారు.

**అదనపు కొనుగోలు కేంద్రాలు మంజూరు ..**

లింగంపేట, ఏప్రిల్ 2: మండలంలోని ఆయా గ్రామాల్లో నూతనంగా సెర్ప్ ఆధ్వర్యంలో నూతన కొనుగోలు కేంద్రాలు మంజూరైనట్లు ఏపీఎం చామంతి శ్రీనివాస్ బుధవారం తెలిపారు. మండలంలోని ముంబాజీపేట, శెట్పల్లిసంగారెడ్డి, నల్లమడుగు(దొడ్డు రకం), ఐలాపూర్, అయ్యపల్లి, భవానీపేట (సన్నరకం), బాణాపూర్, కంచుమహల్, కోర్పోల్, లింగంపేట (దొడ్డు రకం), నల్లమడుగు (సన్నరకం), పర్మళ్ల, శెట్పల్లి (సన్న రకం), లింగంపేట (సన్న రకం), బోనాల్, మెంగారం గ్రామాలకు నూతనంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు కేటాయించినట్లు తెలిపారు. గతంలో ముస్తాపూర్, కన్నాపూర్, మాలోత్ సంగ్యానాయక్ తండా, భవానీపేట, పోల్కంపేట ఎల్లమ్మ గుడి కేంద్రాలు ఉండేవన్నారు. నూతనంగా మంజూరైన కొనుగోలు కేంద్రాలను సంబంధిత గ్రామ సంఘాల వారికి అప్పగించనున్నట్లు వెల్లడించారు.

## బాధిత కుటుంబాన్ని ఆదుకున్న ఎమ్మెల్సీ కవిత



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ జడ్పీటీసీ రాజేశ్వర్‌రావు

రామారెడ్డి (సదాశివనగర్), ఏప్రిల్ 2 : పద్మాజివాడి గ్రామానికి చెందిన గంగాధర్‌రావు ఆరోగ్యం బాగాలేక పోవడంతో ఆయనను నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో కుటుంబ సభ్యులు చేర్చారు. పరిస్థితి విషమించడంతో వైద్యులు ఆయనకు శస్త్రచికిత్స చేసి ఒక కాలు తొలగించారు. డిశ్చార్జి చేసే సమయంలో రూ.నాలుగు లక్షలు చెల్లించాలని దవాఖాన సిబ్బంది తెలిపారు అంత డబ్బులేదని బాధితుడు మొరపెట్టుకున్నాడు. డిశ్చార్జి కాకుండా దవాఖానలోనే దీన స్థితిలో ఉండడంతో సదాశివనగర్ మాజీ జడ్పీటీసీ రాజేశ్వర్‌రావుకు కుటుంబ సభ్యులు ఫోన్ ద్వారా విషయం తెలిపారు. వెంటనే ఆయన దవాఖానకు వెళ్లి ఆయనను పరామర్శించారు. ఈ విషయం ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ కవితకు ఫోన్ ద్వారా తెలిపారు. తక్షణమే స్పందించిన ఆమె వ్యక్తిగత సహాయకుడు నవీన్‌యాదవ్ ను దవాఖానకు పంపి వారి వద్ద ఉన్న డబ్బును కట్టించి రూ. లక్ష మినహాయింపు చేయించారు. వైద్య ఖర్చులకు సంబంధించిన పత్రాలను వారంలోగా తమకు ఇవ్వాలని, వాటి ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మరింత సహాయం అందేలా చూస్తానని కవిత తెలిపారు. దీంతో బాధితకుటుంబ సభ్యులు ఆమెకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల మాజీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి, పద్మాజివాడి గ్రామశాఖ అధ్యక్షుడు రాజిరెడ్డి, దళిత నాయకుడు లింగం, నాయకులు పరువయ్య, కుమ్మరి లింగం, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

## హోరాహోరీగా సాగిన కుస్తీ పోటీలు



పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

లింగంపేట, ఏప్రిల్ 2: మండల కేంద్రంలోని మత్తడి పోచమ్మ ఆలయం వద్ద బుధవారం సాయంత్రం నిర్వహించిన కుస్తీ పోటీలు హోరాహోరీగా సాగాయి. పోటీల్లో పాల్గొనడానికి బాన్సువాడ, గాంధారి, ఎల్లారెడ్డి, మహారాష్ట్ర, కర్నాటక తదితర ప్రాంతాలకు చెందిన మల్లయోధులు తరలివచ్చారు. మహారాష్ట్రకు చెందిన పల్లవి శ్యాంరావ్ పవర్ అనే యువతి తెలంగాణ ప్రాంతానికి చెందిన యువకుడితో కుస్తీ పోటీలో పాల్గొని ఐదు వందల రూపాయల నగదు గెలుచుకుని ఆకట్టుకున్నది. కుస్తీ పోటీల సందర్భంగా అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా స్థానిక పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## యువకులపై న్యూసెన్స్ కేసు నమోదు

ఎల్లారెడ్డిరూరల్, ఏప్రిల్ 2: రోడ్డుపై బర్త్‌డే సెలబ్రేషన్స్ నిర్వహిస్తూ న్యూసెన్స్ చేసిన యువకులపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎల్లారెడ్డి ఎస్సై బొజ్జ మహేశ్ తెలిపారు. ఆయన తెలిపిన ప్రకారం.. ఎల్లారెడ్డి – బాన్సువాడ ప్రధాన రహదారిపై మంగళవారం రాత్రి సమయంలో స్నేహితుడి పుట్టినరోజు వేడుకలను నిర్వహిస్తూ, రోడ్డుపై బైక్‌ను పెట్టి దానిపై ఉంచిన కేక్‌ను కట్‌చేసి న్యూసెన్స్ చేశారు. వారి వద్ద బీరు సీసాలు లభ్యం కావడంతో న్యూసెన్స్ కేసు నమోదు చేశారు. బుధవారం యువకుల తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. రోడ్డుపై ఎలాంటి సెలబ్రేషన్స్, న్యూసెన్స్ చేసినా వారిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

## వేసవి క్యాంపునకు తరలిన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

రామారెడ్డి (సదాశివనగర్), ఏప్రిల్ 2 : సదాశివనర్ మండలం మర్కల్ తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీరు బుధవారం దత్తత గ్రామమైన మర్కల్ గ్రామానికి వెళ్లారు. వీరు ఎనిమిది రోజుల పాటు గ్రామంలో శిబిరాన్ని కొనసాగిస్తారని ప్రిన్సిపాల్ శోభారాణి తెలిపారు. విద్య, ఆరోగ్యం, పోషకాహారం, పర్యావరణ పరిరక్షణ తదితర సేవా కార్యక్రమాలపై వారం రోజులపాటు వలంటీర్లు పని చేస్తారని యూనిట్ కో- ఆర్డినేటర్ చంద్రకళ పేర్కొన్నారు.

## విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలి

లింగంపేట(తాడ్వాయి), ఏప్రిల్ 3: ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని సదాశివనగర్ మండల కేంద్రంలో మహనీయుల విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు మద్దెల భాగయ్య కోరారు. తాడ్వాయి మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహనీయుల విగ్రహా విష్కరణ కార్యక్రమానికి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరి గారి ప్రీతం హాజరవుతారని పేర్కొన్నారు. తాడ్వాయి మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన బహుజన నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎస్సీ విభాగం అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన గైని శివాజీని శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో తాడ్వాయి మండల పార్టీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ జక్కుల రాజిరెడ్డి, ఎస్సీ విభాగం తాడ్వాయి మండలశాఖ అధ్యక్షుడు రాజేందర్, నాయకులు పాల్గొన్నారు.

## లక్ష్మయ్య మృతికి జాజాల సంతాపం



బీఆర్ఎస్ నాయకుడు లక్ష్మయ్య పార్థివ దేహానికి పూల మాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే సురేందర్, బీఆర్ఎస్ నాయకులు

నాగిరెడ్డిపేట, ఏప్రిల్ 2: మండలంలోని జలాల్‌పూర్ మాజీ ఎంపీటీసీ గుర్ల విమల భర్త, బీఆర్ఎస్ నాయకుడు లక్ష్మయ్య(55) బుధవారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సురేందర్ హుటాహుటిన గ్రామానికి చేరుకొన్నారు. లక్ష్మయ్య పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులను ఓదార్చారు. కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ప్రతాప్‌రెడ్డి, దుర్గారెడ్డి, సర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు కృష్ణ, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, యూత్ కమిటీ అధ్యక్షుడు వంశీగౌడ్, నాయకులు ఫరీద్, బాబూరావు తదితరులు ఉన్నారు.

## జూనియర్ కాలేజీకి ఇద్దరు లెక్చరర్ల నియామకం

నాగిరెడ్డిపేట, ఏప్రిల్ 2: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు బుధవారం నూతనంగా ఇద్దరు లెక్చరర్లను నియమించినట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నరేందర్ తెలిపారు. రాజశేఖర్‌రెడ్డి (తెలుగు అధ్యాపకుడు), వినోద (ఆంగ్ల అధ్యాపకురాలు) కళాశాలలో బాధ్యతలు తీసుకున్నట్లు ఆయన చెప్పారు.

## పూడికతీత పనులు ప్రారంభించాలి

లింగంపేట, ఏప్రిల్ 2: నాగన్న బావిలో పూడికతీత పనులు వెంటనే ప్రారంభించాలని డీఆర్డీవో, మండల ప్రత్యేక అధికారి సురేందర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మండల కేంద్రంలోని నాగన్న బావిని బుధవారం ఆయన సందర్శించారు. బావిలో పూర్తి స్థాయిలో నీరు అడుగంటిందని, పేరుకుపోయిన మట్టిని ఉపాధి కూలీలతో పూడిక తీయించాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో నరేశ్, ఏపీఎం శ్రీనివాస్, ఏపీవో నరేందర్, ఎంపీవో మల్లారీ, గ్రామ కార్యదర్శి శ్రవణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

## ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి

లింగంపేట, ఏప్రిల్ 2: ప్రతి కూలీ ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో నరేశ్ సూచించారు. మండలంలోని కోమట్‌పల్లి, పోతాయిపల్లి గ్రామాల్లో చేపడుతున్న పనులను బుధవారం పరిశీలించారు. ప్రతి కూలీకి వంద రోజులు పని కల్పిస్తున్నామని, కచ్చితంగా హాజరుకావాలని సూచించారు. పనులు కొలతల ప్రకారం చేపట్టాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మస్టర్లు తనిఖీ చేశారు. ఆయన వెంట ఉపాధి హామీ సాంకేతిక, క్షేత్ర సహాయకులు, మేట్లు ఉన్నారు.

## రైతు విభాగం అధ్యక్షుడి ఎన్నిక

లింగంపేట, ఏప్రిల్ 2: మండల మున్నూరుకాపు సంఘం రైతు విభాగం అధ్యక్షుడిగా జక్క పెంటయ్యను ఎన్నుకున్నట్లు సంఘం మండల అధ్యక్షుడు గుండ బాలకిషన్ తెలిపారు. మండల కాపు సంఘం సమావేశాన్ని బుధవారం నిర్వహించి రైతు విభాగం అధ్యక్షుడిని ఎన్నుకున్నామని, త్వరలో రైతు విభాగం కార్యవర్గాన్ని నియమించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం అధ్యక్షుడికి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో కాపు సంఘం నాయకులు అంజయ్య, సాయిలు, రాములు, కాశీరాం తదితరులు పాల్గొన్నారు.